# క్లింగ్-లింగ్ కథ

## శబర రాజ్యము

వంశధారానదికి ఇరుప్రక్కల దట్టమైనఅడవులు ఉండేవి. ఆ అడవులమధ్య ఈ నది ప్రశాంతంగానూ గంభీరంగానూ ప్రవహిస్తూ ఉండేది.

ఆ అడవులలో ఆటవిక జాతివారు నివసిస్తూ ఉండేవారు, మన కథనాటికి ఆర్యనాగరికత ఆ ప్రాంతమునకు వ్యాపించి యుండలేదు.

వంశధారానదికి కుడివైపున శబర రాజ్యమూ ఎడమవైపున కోయ రాజ్యమూ ఉండేవి. శబరులు కత్తిపట్టియుద్ధము చేయుటయందు ఆసక్తి కలవారు కారు. వారు పొరుగువారితో కలహములు పెట్టుకోక శాంతంగా జీవిస్తూ ఉండేవారు.

అయితే కోయవారి సంగతి వేరు. ఇతర ప్రాంతముల వారితో విరోధమువస్తే ఏదో విధంగా వారిమచ్చ మాపందే కోయలు ఊరుకొనేవారు కారు. వారికి మంత్రతంత్రములు కూడా తెలుసును.

మనకథ కాలమునాటికి శబర రాజ్యాన్ని రంగ్‌రంగ్ అనేయువకుడు పాలిస్తూ ఉండేవాడు. వంశధారకు కుడివైపున ఉన్న మహారణ్యమే అతని రాజ్యము.

ఆ అడవిలో రకరకాల చెట్లు ఉండేవి. అన్నిటికంటె చంద్రచెట్లు చాలా ఎత్తుగా పెరిగి శాఖోపశాఖలుగా విస్తరించి అడవి అంతా తమదే అయినట్లు ఆక్రమించుకొని ఉండేవి. ఆ అడవిలో మధ్యమధ్య మంచి గంధపు వృక్షాలు పెరిగి ఉండేవి. వాటినుండి వెలువడే సుగంధమువలన అడవి అడవి అంతా ఘుమఘుమలాడుతూ ఉండేది. అక్కడక్కడ పల్లపు ప్రదేశాలలో సహజంగా ఏర్పడ్డ చెరువులు కుంటలు ఉండేవి. కొండలపై నుంచి ప్రవహించే చిన్నచిన్న వాగులు వంకలు కావలసినంత నీటిని తీసికొనివచ్చి ఈ చెరువులలో పోస్తూ ఉండేవి. అందుకని ఎండకాలంలో కూడా ఈ చెరువులలో సమృద్ధిగా నీరు ఉండేది.

ఈ జలాశయాల ప్రక్కన వెదురుపొదలు కిక్కిరిసి పెరిగి ఉండేవి. పూసిన గురువెంద తీగలు ఈ పొదలపై అల్లి బిల్లిగ అల్లుకొని కిలకిల నవ్వుతున్నట్లు ఉండేవి.

ఆ అడవిలో చిన్నచిన్న గుట్టలు ఎక్కడబడితే అక్కడే ఉండేవి. ఆ గుట్టలపైనుంచి సెలయేళ్లు క్రిందికి జారుతూ జల జలమని శబ్దంచేస్తూ పల్లాలకు ప్రవహిస్తూ ఉండేవి.

ఆ అడవికి అందాన్ని ఇచ్చేవి రకరకముల పక్షులు. అవి అడవి అంతటా ఎగురుతూ, ప్రతిచెట్టుపైనా ఒక నిమిషం కూర్చుని ఏదో కాసేపు కిచకిచలాడి వెళ్ళిపోతూ ఉండేవి. పిచ్చుకపిట్ట, గడ్డిపిట్ట, చల్లపిట్ట, నల్లపిచ్చిగాడు, గుంటములుపు గాడు, గువ్వంగి, గూడబాతు, గిజిగాడు మొదలైన చిన్న చిన్న పిట్టలు అక్కడ లెక్కలేనన్ని ఉన్నవి. కొన్ని సుందర

మైన ప్రదేశాలలో మాత్రం చిలుకలు, గోరువంకలు కనబడేవి పిచ్చికల గుంపులకు లెక్కలేదు. బంగారు పిచ్చుక, ముల్లంగి పిట్ట, వెన్నముద్దపిట్టకోడి మొదలైనవి జలాశయాల ప్రక్కనున్న చెట్లపైన గూళ్ళుకట్టుకొని కాపరం చేస్తూ ఉండేవి.

నీరు సమృద్ధిగా దొరుకుచోట్ల ఈ శబరులు ఉండే పల్లెలు ఉండేవి. శబరులు చిన్నచిన్న గుడిసెల్లో నివసించే వారు.

తమ పల్లెలకు సమీపంగా ఉండే పల్లపు భూములను వారు సాగుచేసి రకరకాల ధాన్యాలు పండించేవాళ్ళు. కుసుమలు, గంగాజలాలు, గుత్తిమల్లెలు, చంద్రవంకలు, చిలక ముక్కులు, తీగమల్లియలు, తెల్లబుడమలు, నాగమల్లెలు, ఆకుసన్నాలు మొదలగు ధాన్యాలను ఆ పల్లపుభూములలో పండించేవారు. బంగారు తీగలు, పూరేకులు, బొగడసరలు, వంకీసన్నాలు, రామబాణాలు, సంపెంగలుకూడా వారు పండించేవారు. అడవిలో దొరకే రకరకాల పండ్లు, జలాశయాల్లో దొరికే అరుజు, ఆకుజెల్ల, ఇంగిలాలు, బొమ్మిడాలు, మట్టగిడుసు మొదలగు చేపలూ వారికి ఇష్టమైన ఆహారము.

## 2

శబరరాజుకు చాలా కాలంవరకు సంతానం కలుగ లేదు. కన్న కన్న దేవుళ్ళకు మొక్కుకోగా చివరకు ఒక ఆడ పిల్ల కలిగింది. ఆ పిల్ల క్రమంగా పెరిగి పెద్దదైంది. రంగ్

రంగ్ ఆ బిడ్డను ఎంతో గారాబంగా పెంచాడు. ఆ అమ్మా యికి పదహారో ఏడు వచ్చింది.

పదహారో ఏడు వచ్చినంతనే శబర కాంతలు సంతోషిస్తారు. ఎందుకంటే ఆ వయస్సు వచ్చినప్పటినుండి ఆడపిల్లలు తమకు తగిన వరుణ్ని వివాహమాడడానికి ప్రయత్నాలు ఆరంభిస్తారు.

శబరులలో ఆడపిల్లలు తమ ఇష్టము వచ్చిన వారిని పెళ్ళిచేసుకొనే ఆచారం ఉన్నది. శబర కన్య తనకు కావలసిన వరుణ్ని తానే చూచుకొంటుంది. ఆకథ ఇట్లా నడుస్తుంది.

ఆడపిల్లలూ మగపిల్లలూ కూడా వయస్సు వచ్చినప్పటి నుంచీ అడవుల్లోకి వెడతారు ఆహారం సంపాదించుకొంటానికి. చింతపండు, ఇప్పపువ్వు, వెదురుబియ్యం, వెలగపండ్లు, తూగి పండ్లు, రేగుపండ్లు మొదలైన సంబారాలు వారు సంపాదించుకొని తమ ఇళ్ళకు తీసుకుపోతారు.

ఈ వస్తువులలో ఇప్పపువ్వు అంటే శబరులకు ఎంతో ఇష్టం. ఇప్పపువ్వు వెదురుబియ్యం కలిపి వండితే ఎంతో రుచికరమైన ఆహారము అవుతుందట. ఆ పువ్వులోనుంచి కల్లు కూడా తీస్తారు. ఆర్యులకు సోమపానం ఎంత ఇష్టమో శబరులకు ఇప్పసారా త్రాగటం అంత ఇష్టము.

ఇల్లాగ అడవులలో తిరుగుతున్నప్పుడే పడుచుపిల్లలు, పడుచువాండ్లు కలుసుకొంటారు. పిల్ల తనకు ఇష్టమైన పిల్లవాణ్ణి పలకరిస్తుంది. మెల్లగా ఆ అబ్బాయితో స్నేహం చేస్తుంది. ఇల్లాగ ప్రారంభం అవుతుంది ఆ దంపతుల జీవితం. వాళ్ళ

స్నేహం అంతకంతకు వృద్ధిఅగుతూ ఉంటుంది. ప్రతి రోజూ వారు కలసి అడవికి పోయి తిండానికి కావలసిన పదార్థాలు సంపాదించుకొంటారు.

ఇద్దరూ కలిసి తిరుగుతారు. కలిసి పనులు చేసుకుం టారు. ఆడుతూ పాడుతూ పగలల్లా అడవిలో తిరుగుతారు. సాయంత్రం కాగానే కబుర్లు చెప్పుకుంటూ ఇళ్ళకు వచ్చేస్తారు.

ఈ తిరుగడంలో ఒకరి అభిరుచులు ఒకరికి తెలుస్తవి. వాళ్ళ ఇద్దరికీ పొత్తు కుదురుతుందో కుదరదో అన్న విషయం కూడా వాళ్ళు ఆ స్థితిలోనే తేల్చుకుంటారు. ఇట్లా ఒకరి సంగతి ఒకరికి తెలిసిన తరువాత వారి స్నేహం మరింత గట్టి పడుతుంది. ఈ సంగతి పెద్దవాళ్లు గ్రహించి నవ్వి ఊరుకొం టారేగాని ఏమీ అభ్యంతరం చెప్పరు. ఇట్లా ఆ జంట కొంత కాలం కులాసాగా గడుపుతారు.

ఇద్దరూ కలిసి చేసే పనులు ఇట్లా ఉంటవి. ఆ చిన్న వాడు చెట్టెక్కి ఇప్పపూలను రాలుస్తాడు. ఆ పువ్వులన్నీ ఆ పిల్ల నెత్తిమీద జలజలరాలుతవి. ఆమె పకపక నవ్వుతుంది. తరువాత ఆ ఇప్పపువ్వునంతా గంపల్లోకి ఎత్తుకొని సంససల్లాపా లాడుకొంటూ ఆ పిల్లలు ఇద్దరూ గూడెంలోకి వెళ్ళిపోతారు.

తేనెను సంపాదించేటప్పుడుకూడ ఇలాగే యువతీ యువకులు ఒకరి కొకరు సాహాయ్యం చేసుకొంటారు. చిన్నది చిదుకులు ఏరి తెస్తుంది. చిన్నవాడు చెకుముకి రాయితో నిప్పుజేసి వాటికి ముట్టిస్తాడు. పెద్దమంట అవుతుంది. తేనెపట్టు క్రింద ఆ మంటను పెడతారు. ఆ వేడికి తాళలేక ఆతేనెటీగ

లన్నీ, నలుదిక్కులకు ఎగిరిపోతవి. పోతూ పోతూ వాళ్ళను అంటపొడిచి పోతాయి. ఆ బాధను ఆ కుర్రవాడు ఎట్లాగో భరించగలుగుతాడు గాని ఆ చిన్నపిల్ల ఆ బాధకు తట్టుకోలేక గిలగిల్లాడుతుంది. శబర కుమారుడు నవ్వి, ఆమె ఏడ్చినందుకు ఎగతాళిచేస్తాడు. కాసేపు పరిహాసాలు అయిన తరువాత, వాళ్లు ఇద్దరూ ఏదో ఆకు తెచ్చుకొని, పసరుపిండి తేనెటీగలు కుట్టిన చోట పూసుకొంటారు. బాధ మాయమైపోతుంది. ఇలాగ వాళ్లు చీకూ చింతా లేకుండా కాలం గడిపేస్తు ఉంటారు.

మొక్కజొన్న కండెలు కనిపిస్తే తంపట వేసుకొని తింటారు. నారింజ, కమలా, అనాస, పనస మొదలైన పండ్లు వారికి ఆ అడవిలో విస్తారం దొరుకుతవి. అవి తిని వారు పొట్ట నింపుకొంటారు. ఎప్పుడైనా ఒక కంచెలో గువ్వపిట్ట దొరికితే, దానిని వాళ్ళు కాల్చుకుతింటారు. వాళ్ళకు ఎక్కువ ఆనందం కలిగినప్పుడు వాళ్ళు ఆ అడవిలోనే నాట్యం చేస్తారు. పగలంతా ఇల్లా కులాసాగా గడిపి సాయంకాలానికి తమ ఇండ్లకు చేరుకుంటారు. ఇల్లాగ కొన్ని నెలలు గడచినతరువాత పెద్దల ఆశీర్వాదాన్ని పొంది వారు పెళ్ళిచేసుకొని భార్యాభర్తలు అవుతారు.

పెళ్ళికాక పూర్వము శబర స్త్రీలు ఇల్లాగ తమకు ఇష్టమైన పురుషునితో సరససల్లాపాలు ఆడినా, నీతి విరుద్ధంగానూ, సంఘ మర్యాదలకు వ్యతిరేకంగానూ ఎప్పుడూ ప్రవర్తించరు.

పదహారోఏడు వచ్చినప్పటినుంచి శబర స్త్రీకి ఇలాంటి

స్వాతంత్ర్యము వస్తుంది. అప్పటినుంచే ఆమె స్వేచ్ఛగా అడవికి వెళ్ళి తనకు ఈడూ జోడూ అయిన యువకునితో సరదాగా కాలం గడుపుతుంది. అటువంటి స్వేచ్ఛలభించే రోజు కాబట్టి శబర కాంతలు తమ పదహారోఏడు పుట్టినరోజు పండుగను ఎక్కువ సంతోషంతోనూ ఉత్సాహంతోనూ జరుపు కుంటారు.

## 3

ఆరోజుల్లో ఒక సంవత్సరం పుష్యశుద్ధ దశమినాడు శబర రాజ్యమంతా సంతోషంతో పొంగిపోయింది. ఎందుకంటే ఆరోజే శబరభూపతి కుమార్తె పదునారవ పుట్టిన రోజు పండుగ. ఆమెపేరు లింగ్.

శబరభూపతి ఉన్న గ్రామం ఆరోజున కన్నుల పండువగా అలంకరించబడింది. ప్రతి ఇంటిముందూ అరటి కంబములు నాటబడినవి. ప్రతి ద్వారాన్ని పచ్చని మామిడిఆకు తోరణాలతో అలంకరించారు. రకరకములయిన పుష్పాలతోనూ మాలలతోనూ ప్రతి గుమ్మము అలంకరించబడింది.

శబరరాజు ఉన్నది దిబ్బపై నిర్మింపబడిన ఒకపెద్ద కుటీరము. గన్నేరుపూల తోరణాలతో అలంకృతమై అది కళకళలాడుతూ ఉన్నది. ఆ కుటీరము ముందు ఒకపెద్ద పందిరి వేశారు.

పందిరిలో జనం కిటకిటలాడుతున్నారు. లోపల రక

రకాల పిండివంటలు వండుతున్నారు. అందుకనే కమ్మని వాసనలతో ఆ ప్రదేశమంతా ఘుమఘుమలాడిపోయింది. ఆ రోజున ఒకదివ్యమైన విందు జరుగబోతున్నది.

ఆరోజు అక్కడికి వచ్చిన జనం అంతా ఏదో ఒక పని నెత్తిన వేసుకొని చేస్తున్నారు.

కొందరు అడవిలోనికి పోయి వంటచెరుకు తెచ్చినారు. కొందరు మైదానాన్ని పస్వంచేయుటంలో నిమగ్నులైనారు. కొందరు వివిధ వాద్యయంత్రాలను ఒక చోట చేర్చి వాటిని కడిగి శుభ్రంచేస్తున్నారు. తాళాలు, బూరలు, డోళ్ళు, డప్పులు, పెద్దబాకాలు మొదలైనవి ఎన్నో అక్కడ పడి ఉన్నవి. ఇవికాక వెదురుగొట్టాలతో చేసిన వాద్యాలకు లెక్కలేదు. నవ్వుకొంటూ, పాడుకొంటూ, ఆడుకొంటూ సరససల్లాపాలాడుకొంటూ వారు ఆ వాద్య యంత్రాలను శుభ్రంచేస్తున్నారు.

సీతాఫలాలు, రామాఫలాలు, తాటిపండ్లు, కొబ్బరికాయలు, పనసపండ్లు, అనాసపండ్లు, నారింజపండ్లు, కమలాలు మొదలయిన ఫలాలను తట్టలకెత్తి ఒక మూలను ఉంచినారు. మరియొక మూలను బానలు, కుండలు; గాబులు కడవలు మొదలగు మృణ్మయ పాత్రలను తాటికల్లు, ఈతకల్లు, ఇప్ప సారా మొదలగు మద్యవిశేషాలతో నింపినారు. వాటిల్లో ఆ ద్రవ్యాలు మిసమిసలాడుతూ, తొణికిసలాడుతూ ఉన్నాయి.

విందునకై వచ్చిన వారిలో చాలమంది నేలపైనే

కూర్చునియున్నారు. కొందరు శబర ప్రముఖులు మాత్రం ఈతాకుల చాపలపై ఉపవేష్టించిఉన్నారు. శబర కాంతలు పూసలూ పూలూ మొదలగు వాటితో అలంకరించుకొని అటూ ఇటూ తిరుగుతూఉంటే, తళుకు తళుకుమని మెరసే మెరుపులు వచ్చి పోతూవున్న ఆకాశంలాగ ఉన్నది ఆ దృశ్యం.

రంగ్‌రంగ్ ప్రభువు మోకాళ్ళవరకు జారియున్న ముతకవస్త్రాన్ని కట్టుకున్నాడు. రంగు రంగు ఈకలతో అలంకరించబడిన కిరీటాన్ని తలపై పెట్టుకొన్నాడు. పచ్చని గంధాన్ని వంటినిండా పూసుకొన్నాడు.

శబరరాజు కుమార్తె లింగ్ ఎర్రని గళ్ళగళ్ళ పరికిణీ కట్టుకొన్నది. రంగురంగుల పూసలుపేర్లు మెడలో వేసుకొన్నది. ఆ రోజు ఆమె పదునారవపుట్టినరోజు పండుగ వైభవంగా జరుగబోతున్నది.

## 4

ఒకవిచిత్రమైన విధానాన్ని అనుసరించి శబరులు తమ పండుగలు జరుపుకొంటారు.

ఇటువంటి శుభకార్యాలు జరుపుకొంటానికి వారి పూజార్లు లగ్నంపెడతారు. శబరులు శుభముహూర్తాలు నిర్ణయించడంలో చాలా నేర్పరులు. పెళ్ళి పుట్టినరోజు

అందుకే ముఖ్యమైన శుభకార్యాలు ఏ లగ్నంలో ఏ నక్షత్రాన జరపాలో వారు మనలాగే నిర్ణయిస్తారు.

శబరులు ముఖ్యంగా నక్షత్రబలం చూస్తారు. నక్షత్రాలు ముప్పైను. ఆ నక్షత్రాలకు సూర్యుడు తల్లి, చంద్రుడు తండ్రి. తల్లి ఈ బిడ్డలను కనగానే చాలా ఆకలివేసి తనపిల్లలను తానే తింటూవచ్చింది! అప్పుడు తండ్రి వెంటనే వెళ్ళి అడ్డుకొన్నాడు. అయితే ఈ లోపుననే ఆ తల్లి సగం మంది పిల్లలను తన పొట్టనుపెట్టుకొన్నదట! అందుకనే కన్నతల్లికి భయపడి ఈ నక్షత్రాలు పగలు కనపడవ్వా అని సవరలు చెప్పుకొంటారు.

ఏదైనా శుభకార్యం జరుపుకొంటానికి ఎన్నో కలిసి రావాలి. మంచి ముహూర్తం కుదరటమే కాక మంచిశకునం కలిసి రావాలె.

అడవులలో వుండే పక్షులవలన శకునఫలం వారు తెలుసుకొంటారు. పక్షులకూతలనూ, జంతువుల అరుపులనూ, సవరలు జాగ్రత్తగా పరిశీలిస్తారు. ఆ కూతలనూ బట్టీ, అరుపులనుబట్టీ ఆ పక్షులుగానీ, జంతువులుగాని సంతోషంగా ఉన్నవో, కోపంగా ఉన్నవో వారు సులభంగా గ్రహిస్తారు.

పక్షిగాని జంతువుగాని కోపంగా ఉన్నట్లు అయితే తాము చేయబోయే పనికి అవి ప్రతికూలతను ప్రదర్శిస్తున్నట్లు గ్రహిస్తారు. లేక అది సంతోషాన్ని వ్యక్తపరిస్తే అవి అనుకూలంగా ప్రకటిస్తున్నవి అన్నమాట!

ముఖ్యంగా గువ్వ, గుడ్లగూబ, పిల్లి, కాకి, నెమలి శుభాశుభములను సూచించగలవని వారి నమ్మకం.

లింగ్ రాకుమార్తె పుట్టినరోజు పండుగకు బొయాలు నక్షత్రబలం నిర్ణయించి శకునాలు చూచి ముహూర్తం నిర్ణయించారు.

ఆ రోజున పెద్దలు పిన్నలు అంతా వచ్చారు. లగ్న సమయానికి కొంచెం ముందుగానే వేడుకలు ప్రారంభం అయినవి. మంగళవాద్యాలు వాయించడం మొదలుపెట్టినారు.

కొందరు యువకులు గ్రోడ్ — రజన్ అనే వాయిద్యాన్ని వాయించడం మొదలు పెట్టినారు. అది మన ఫిడేలువంటిది! మరికొందరు మొమెరిజన్ అనే తంతి వాద్యంపై మధురమైన స్వరాలను పలికిస్తున్నారు. ఒకవైపున వాద్యాలు వాయిస్తూఉంటే, మరియొకవైపున కొంతమంది సమావేశమై ఒక గాయకుడు శ్రావ్యంగా పాడే కీర్తనలను వింటున్నారు.

ఆ రోజున శుభమును ప్రస్తరించే కీర్తన ఒకటి పాడుతున్నాడు. ఆ పాట ఇది—

కుర్రీ కుర్రీ గాన్లొ
గుతాయ్ గుతాయ్ గుతాయ్
సాసతోంగ్ సిత్రీ జవోంగ్
గుతాయ్ గుతాయ్ గుతాయ్
కుర్రీ కుర్రీ — కుర్రీ గాన్లొ

# క్లింగ్-లింగ్ల కథ

## శబరదేవతలు

ఆ తరువాత ముహూర్తసమయం వచ్చింది! బొయాలు నదిలో స్నానంచేసి మంచిబట్టలను కట్టుకొనివచ్చి దేవతలను ఆరాధించడం ప్రారంభించేశారు.

సవరలకు ఆరుగురు ముఖ్యమైన దేవతలు ఉన్నారు. వారు ఎడజా, ఇజ్జా, సోనుమ్, రతూనాసోమ్, దూరి - తప్పరే, కరూ, అనర్ అజ అనువారు.

శబరులకు మతగురువులైన బొయాలు ఆయా దేవత తలను మంత్రపూర్వకముగా ఆహ్వానించి స్తోత్రముచేసి ప్రీతి వచనాలు పలుకుతారు, ఆ దేవతలు తృప్తికోసం జంతువులను బలిఇస్తారు. అప్పుడు ఆదేవతలు సంతోషించి ఆ బిడ్డను దీవించిపోతారు.

బొయాలు ఒక్కొక్క దేవతనే పిలిచి, ఆ దేవతలకు ఇష్టమైన ప్రార్థనలు చేయడము మొదలుపెట్టారు. ఒక్కొక్క దేవతను ఒక్కొక్కవిధంగా తృప్తిపరచవలసి ఉంటుంది. అందరినీ ఒకేవిధంగా ప్రార్థించకూడదు. ఏ దేవతను ఏ విధంగా ఆహ్వానించాలో ఎల్లాగ తృప్తిపరచాలో బొయాలకు మాత్రమే తెలుసు.

వారి ప్రార్థనలు ఇలాగ ఉంటవి. ఎడజా అనే దేవతను గూర్చిన ప్రార్థన ఇది. "ఓ ఎడజా నీకు నమస్కారములు. నిన్ను మరిచిపోము. ఈ బిడ్డకు జీవితములో ఎల్లాంటి కష్టాలూ కలగకుండా రక్షించు తల్లీ. గులర్ పండుగరోజున నీకు పది మేకలను బలి ఇస్తాము. ఈ బిడ్డను సర్వదా కాపాడుము తల్లీ!"

ఆ దేవతలను ఆరాధించడంలో ఒక్కొక్క దేవతను ఒక్కొక్క వరం అడగవలెనంటే ఆరోగ్యమును ఇచ్చే దేవత వేరు ఐశ్వర్యాన్ని ప్రసాదించే దేవత వేరు. ఆరోగ్యాన్ని ఇచ్చే దేవతను ఐశ్వర్యము ఇయ్యమని అడుగకూడదు. అడిగితే ఆ దేవతకు కోపంకూడా వస్తుంది. అవన్నీ రహస్యాలు. ఆ రహస్యాలు బాయాలకు మాత్రమే తెలుసు.

ఒక దేవతను ప్రార్థించిన తరువాత, ఆ దేవతకు ఇష్టమైన నాట్యం చెయ్యాలి. ప్రార్థన అయిపోయిన తరువాత బాయా ఒక కొమ్మును ఊదుతాడు. ఈ ఊదడము అనేక రకాలు. ఒకరకంగా ఊదితే ఒకరకము నాట్యం చెయ్యాలి! మరొక రకంగా ఊదితే ఇంకో విధమైన నాట్యం చెయ్యాలి. ఈ విషయాలన్నీ శబర నాయకులకు తెలుసు ... కొమ్ము ఊదడముతోనే ఏ రకం నాట్యము చెయ్యాలో శబరులు గ్రహించి వారు ఆ రకము నాట్యమును ప్రారంభిస్తారు.

ఈ నాట్యము కొంచెము సేపు జరుగుతుంది. స్త్రీలూ పురుషులు కలిసి నాట్యం చేస్తారు. కొంత సేపటికి వారు అలసి

పోతారు. అలసి పోగానే విశ్రమించటానికి వారు పానశాల లోకి పోతారు. నటీ నటులు అక్కడ కావలసినంత మద్యాన్ని సేవిస్తారు. అందరూ ఒకరితో నొకరు సరస సల్లాపాలు ఆడు కొంటారు.

ఇంతలో బూయూ మరియొక దేవతను ఆహ్వానించి మంత్ర యుక్తంగా పూజించి, పుట్టినరోజు పండగ జరుపు కొంటూ వున్న బాలికను దీవించి పొమ్మని ప్రార్థిస్తాడు... ఆ పని పూర్తి కాగానే కొమ్మునో, శంఖాన్నో ఊదుతాడు. వెంటనే మరియొక నాట్యము ఆరంభం అవుతుంది.

మొదటిసారి నాట్యము చేసినవారే మళ్ళీ రెండవసారి రావచ్చుగాని వారు మిక్కిలి అలసి పోయి ఉంటే మరి కొందరు వచ్చి వారిస్థానే నాట్యము చేస్తారు.

శబరులకు లాస్యము, నాట్యము, తాండవము, హల్లీ సకము, మొదలైన నాట్య విశేషాలు తెలుసు.

పాటలేకుండా కరచరణాది సర్వాంగాలను మనోహరం గానూ విలాసంగానూ చలింపచేస్తే దానిని లాస్యమంటారు. అటువంటిదే పురుషులు చేస్తే దానిని తాండవ మంటారు.

శబర దేవతలలో కొందరికి లాస్యం, కొందరికి తాండ వమూ, కొందరికి నాట్యమూ ఇష్టము. ఎవరికేది ఇష్టమో బూయూలకు తెలుసు. అందుకని వారు కొందరు దేవతల ప్రీతి కోసము నృత్యాన్ని, మరికొందరి దేవతల అభీష్ట తృప్తికై తాండవాన్ని ప్రదర్శిస్తారు.

బోయీలు ఆరోజున ఆరుగురు దేవతలను పరితృప్తులను చేసి వారి దీవనలను బిడ్డకు లభింపజేయాలి. ఆ దేవతలు ఆ కుమారికి ఆరోగ్యాన్ని భోగభాగ్యాలను ఇస్తారని వారి నమ్మకం.

నాట్య ప్రదర్శనానంతరం నైవేద్యము జరుగుతుంది. మాంసము, పాలు, వెన్న, పెరుగు, పండ్లు, మద్యము మొదలైన సంబారాలను వారు దేవతా ప్రీతి కొఱకు సమర్పిస్తారు. నివేదనా నంతరం ఆ దేవతా పరిభుక్త శేషమును శబరులు భుజిస్తారు. ఆ తరువాత ఇంకో దేవతకు పూజ! అనంతరం నాట్యం జరుగుతుంది. మళ్ళీ తినడము త్రాగడమూను. ఈ విధంగా ఆరు ఆవృత్తులు జరగాలి. అంటే ఆ రోజున రాజూ ఆతని పరివారమూ, బంధు జనమూ, ఇతర ప్రేక్షక జనమూ, ఆరు సార్లు తిని ఆరుసార్లు త్రాగుతారు.

# శబరరాజ్యము

## దేవతారాధన

బొయాలు ఎడజాకు పూజలు సలిపిన తరువాత ఐడ్బా సోనుమ్ అను దేవతను పూజించినారు. ఆమె తన భక్తులకు సంతానాన్ని ఇస్తుంది.

ఆ తరువాత "రతూనా సోమ్"కు ఆరాధనలు జరిగినవి. ఆమె అనుగ్రహము సంపాదించిన వారికి ఎటువంటివ్యాధి రాదు. ఆ తరువాత "డూరి-తిప్పరే" అను దేవతలకు పూజలు జరుపబడ్డవి. వీరు ఇద్దరూ అప్ప చెల్లెండ్రు. వీరు భక్తులకు ఆరోగ్యాన్ని సౌందర్యాన్ని ప్రసాదిస్తారు.

వీరి తరువాత తక్కిన వారికికూడ క్రమంగా భక్తి ప్రపత్తులతో కొలుపులు సాగినవి.

అయితే ఈ పూజలు జరగడములో ఒక అపరాధం జరిగింది. అయిదుగురు దేవతలకు పూజలు అయ్యేటప్పటికి అందరూ ఒడలు తెలియని స్థితిలో నేలపై ఒరిగిపోయినారు. ఒక్కడైనా జాగ్రదావస్థలో లేడు. అందరూ అటువంటిస్థితిలో ఉండటం మూలాన అసర్ అజ అనే దేవతకు పూజ జరుగ లేదు. ఆ దేవతను పూజించవలసిన సమయము వచ్చేసరికి

రాజూ, రాజు బంధువులూ, బోయీలూ, మిగిలినఅతిథులూ అందరూ తప్పత్రాగి నేలపై పడి ఉన్నారు.

అనర్ అజ్‌కు కోపం వచ్చింది. ఆమె రాజును ప్రజలనూ అందరినీ కఠినమైన శాపానికి గురిచేసింది.

"మీరు అంతా కొన్ని ఏండ్లు ఇప్పుడెల్లా ఉన్నారో అల్లాగే పడి ఉంటారు. మీరే కాదు దేశంలోని ప్రజలూ, ఇతర ప్రాణులూ అంతా నిద్రా ముద్రితులై పోతారు. కొన్ని ఏండ్లు గడచిన తరువాత ఆ పరమశివుని అనుగ్రహం వలన మీకు ఈ అవస్థనుండి విముక్తి కలుగుతుంది. అంత వరకూ ఈ దేశం దేశం అంతానూ దేశంలో ఉన్న ప్రతిప్రాణీనూ కదలదు మెదలదు. కళ్ళుమూసికొని పడి ఉంటుంది."— ఇది ఆ దేవత ఇచ్చిన శాపం.

ఆ శాప ఫలితంగా దేశం అంతా నిద్రాముద్రితమై పోయింది. బోయీలు మాంసమును తింటున్నవాళ్ళు తింటున్నట్లే కన్నుమూశారు. మిగిలినవాళ్లు ఎట్లా ఉన్నవాళ్లు అట్లా నిద్రాదేవి ఒడిలోకి జారిపోయినారు.

చెట్లు తలలు వేలవేసినవి. ఆకులు వర్ణ విహీనములై వడిలిపోయినవి. వన్యమృగములు అన్నీ ఎక్కడ ఉన్నవి అక్కడే నేలకొరిగి కన్నుమూసినవి. అప్పటికి ఆకాశంలో ఎగురుతూఉన్న పక్షులు తిన్నాలున పడిపోయినవి. గాలికికూడా నిద్రవచ్చింది కాబోలు చలనం లేకుండా స్తంభించిపోయింది.

సెలయేరులు కాల్వలు, వాగులు వంకలు మొదలైన ప్రవాహ లలోని నీరు పారేశక్తిని పోగొట్టుకొని ఎక్కడనీరు అక్కడ నిలచిపోయింది.

పానశాలలోని స్త్రీలు ఎక్కడవాళ్ళు అక్కడ ఒరిగి పోయినారు. ఒకతె పానపాత్ర నోటిదగ్గర పెట్టుకొని ఆ స్థితి లోనే నిద్రపోయింది. ఒకర్తె కుక్కను కొట్టడానికి కఱ్ఱను ఎత్తింది. ఎత్తినకఱ్ఱ ఎత్తినట్లే ఉంది. ఆమె ఆ స్థితిలోనే నిద్ర పోయింది. వీథులలో నడుస్తున్నవాళ్లు ఎక్కడివాళ్లు అక్కడ ఒరిగిపోయినారు. అడవులలో పూరిని మేస్తూఉన్న పశువులు, వీధులలో తిరుగాడే కుక్కలు, చెట్లపై గంతులు వేస్తూఉన్న కోతులు, ఎక్కడివక్కడ నేలపైఒరిగి కన్నులు మూసుకొన్నవి.

శబరరాజ్యం అంతా నిద్రాముద్రితమైనది. ఆ నిశ్శబ్దత భయంకరంగా ఉంది.

ఎక్కడా చలనము లేదు. పక్షుల కిచకిచలు కోకిల మధుర కూజితములు వినరావడం లేదు. శిలలు సహితము నిద్రాణమై ఉన్నట్లు కనుపించినవి.

రంగ్‌రంగ్ రాజుగారి కుటీరాంతర్భాగంలో స్త్రీలం దరూ జీవలక్షణములను పోగొట్టుకొన్న వారివలె, నిర్జీవ ప్రతి మలవలె పడియున్నారు. వారందరిలో చుక్కలలో చంద్రుని వలె, రాకుమారి లింగ్ భాసిస్తూ ఉన్నది. ఆమె నిద్రపోతు న్నట్లూ లేదు, నిద్రపోతూ ఉన్నట్లూ ఉంది. ఆమె పెదవుల

పైన చిగురించిన మందహాసము చెరిగిపోకుండా అట్లాగేఉంది. తుమ్మెద రెక్కలవలె నల్లగా స్నిగ్ధముగానున్న ఆమె శిరోజాలు జారి, విడివడి ఆమె భుజాలపై మెరుస్తున్నవి. ఆమె చెక్కిళ్ళు పండు తమలపాకులవలె మనోహరంగా ఉన్నవి. పువ్వులపాన్పుపై నిద్రిస్తూఉన్న లక్ష్మీదేవివలె ఆమె భాసిస్తూ ఉన్నది.

# క్లింగ్ - లింగ్ల కథ

## కోయరాజ్యము

వంశధారకు ఎడమవైపున కోయరాజ్య మున్నది. శబర రాజ్యము నిద్రాశాపభద్రమైన రోజులలోనే కోయ రాజ్యమునకు తురాయి అను యువకుడు రాజైనాడు. తన వంశములో తురాయ్ నాల్గవతరమువాడు. ఆ రాజ్యమునకు మూలపురుషుడు చిత్రగాయకుడనువాడు. ఆయన సంగతి కొంచెము తెలుసుకొందము.

చిత్రగాయకుడు మొదట రాజకుటుంబమునకు చెందినవాడుకాడు. అతడొక కిరాతుడు. ఒక రోజున ఆయన వంశధారానదిలో స్నానముచేయడానికి వెళ్ళాడు. అదే సమయానికి కామదేవుడు అనే ఋషి ఆ నదిలో ప్రాతఃకాల స్నానానికై వచ్చినాడు. ఆయన మిక్కిలి వృద్ధుడు. శివపద ధ్యానమునందు గాఢత్వమును సంపాదించుకొన్నవాడు.

ఆ ముసలిఋషి నీటిలో దిగడముతోనే మొసలి యొకటి ఆయన కాలు పట్టుకొని లోపలికి ఈడ్వడం మొదలు పెట్టింది. వడలిబడుగైయున్న ఆఋషి ఆ మొసలి లాగుడును తట్టుకోలేక మెల్లగా నదీగర్భంలోకి జారిపోతూఉంటే చిత్రగాయకుడు ఆ దృశ్యాన్ని చూచినాడు. వెంటనే ఆ కిరాతుడు

తన అమ్ములపొదినుండి బాణాన్ని ఒకదానిని తీసి విల్లు ఎక్కు- పెట్టి ఆ మొసలిని హతమార్చాడు. ఋషి బ్రతికిబైటపడ్డాడు. ఆయనకు చిత్రగాయకునియందు దయకలిగి అతనికి శివమంత్ర మొకటి ఉపదేశించాడు.

ఆనాటినుండి చిత్రగాయకుడు పక్షులనూ జంతువులనూ చంపడము మానేశాడు. శాఖాహారమును మాత్రమే పుచ్చుకొనేవాడు. ప్రతిరోజూ ఆయన శివమంత్రాన్ని జపంచేసి శివపూజ చేసేవాడు.

చిత్రగాయకుని పూజలకు పరమేశ్వరుడు తృప్తిపొంది అతనికి కలలో కనపడి ఇట్లా అన్నాడు, "ఏమయ్యా, చిత్రగాయకా, నీ భక్తికి నేను మెచ్చినాను. నీవు ధనవంతుడవు కావడానికి ఒకమార్గం చెబుతాను విను. నీకుటీరానికి సమీపంలోనే శివలింగమొకటి భూస్థాపితమై ఉన్నది. ఆ లింగాన్ని త్రవ్వి ఎత్తి నీవు దానిని పూజిస్తే నీకు ఐహిక సౌఖ్యములు కలగడమేకాక శివసాయుజ్యంకూడా లభిస్తుంది.

ఆ లింగంఉన్న ప్రదేశానికి కొంచెము ఉత్తరంగాపోతే అక్కడ ఒక మధుక వృక్షం కనిపిస్తుంది. నీవు దానిని ఆశ్రయించు. ప్రతిరోజూ ఉదయం ఆ వృక్షం రెండు సువర్ణ పుష్పాలను రాలుస్తుంది. శివభక్తులు కానివారికి అవి కనుపించవు. నీవు వానినితీసుకొని అమ్మి, ధనాన్ని సంపాదించుకో. ఆ ధనంతో నీవు ఒక పట్టణాన్ని నిర్మించు. ఆ పట్టణానికి నీవే ప్రభువుకా. క్రమముగా ఆ పట్ట[illegible] నీవు జయించి ఒక రాజ్యాన్ని స్థాపి[illegible]. నీ

రాజ్యంలో ఉండే ఆటవికులు సుఖంగా జీవించడానికి కావలసిన ఏర్పాట్లు చేయి" అని ఈవిధంగా అనతిచ్చి ఆ పరమ శివుడు అంతర్ధానమైనాడు.

కిరాతుడు శివాజ్ఞను శిరసావహించి ఆ దైవము చెప్పినట్లు చేశాడు. ఆయన ఆ ప్రాంతానికంతా ప్రభువు అయినాడు. ఆతడు చాలకాలము పాలించి ప్రజలకు ఎన్నో సౌఖ్యములను చేకూర్చినాడు.

ఆ వంశములో నాల్గవవాడు తురాయి. తురాయి కూడా శివభక్తుడే. లింగాన్ని అర్చన చేయంది ఆయన పచ్చి మంచినీళ్ళయినా ముట్టుకొనేవాడు కాదు.

# శబరరాజ్యము

## కోయలు

వంశధారా నదికి ఎడమప్రక్కన ఉన్న అడవి అంతా కోయరాజ్యములో చేరి ఉన్నది. ఆ అడవులలో అక్కడక్కడ పల్లెలు వెలసినవి. ఆ పల్లెలలో కోయవాండ్రు ఉంటారు.

కోయలలో పెద్ద భాగ్యవంతులు ఉండరుగాని, ఎవ్వరికీ తింటానికీ, ఉండటానికీ, కట్టుకోడానికీ ఏమీ లోపం ఉండదు.

కోయలకు అడవే కన్నతల్లి, కల్పవృక్షమూనూ. ఆ అడవిలో కోయలకు సమస్త పదార్థాలు దొరుకుతవి. జీవితావసరములన్ని అడవిలోనే లభిస్తవి.

కోయదొరలూ, దొరసానులూ ఉదయాన్నే అడవిలోకి పోతారు. ఆ అడవిలోనుంచి ఎవరికి దొరికిన ఆహార పదార్థాలు వారు తెచ్చుకొంటారు. పుట్టతేనె వారికి విస్తారము దొరుకుతుంది. అది పుష్టినిచ్చే ఆహారము. ఆ అడవిలో రకరకాల పండ్లు వారికి కావలసినన్ని దొరుకుతవి. వారు ఆ పండ్లు తిని ప్రవాహోదకాన్ని కడుపారతాగి, ఆరోగ్యవంతులై ఉంటారు.

ఆవులు, గేదెలు, మేకలు గొర్రెలు మొదలైన వాటిని కోయలు పెంచుకొనేవాళ్ళు. వాటివలన పెరుగు పాలు, వెన్న వారికి లభించేవి. వారి పశువులు అడవిలో మేసి వాగుల్లోనో ఇన్ని నీళ్ళు త్రాగుతవి. వాటిని పెంచడంలో కోయలకు ఎటు వంటి వ్యయప్రయాసలూ లేవు. ఆవులూ గేదెలూ ఇచ్చే పాలను కోయవారు మిక్కిలి ప్రీతిగా త్రాగుతారు. వారికి ధనాశ లేదు. ధనముతో వారికి ప్రయమే లేదు.

కోయలు అబద్ధాలాడరు. అన్యాయాలకు ఒడిగట్టరు.

కోయరాజు రాజ్యంలో హింస అనేది ఉండేది కాదు రాజుగానీ ప్రజలు గానీ అనవసరంగా ఏ మృగాన్ని చంపే వారుకారు. వారు కుందేళ్ళు, మేకలూ గొర్రెలూ మొదలైన జంతువులనూ, గువ్వలూ కోళ్ళూ మొదలైన పక్షులనూ ఆహారానికి కావలసినప్పుడు మాత్రం చంపేవారు. మిగిలిన మృగాలజోలికి పోయేవారు కారు.

ఒక విచిత్రం ఏమిటంటే పెద్దపులి, తోడేలు, సింహము మొదలగు క్రూర మృగాలకు కూడా కోయలు ఎటు వంటి హానిని చేసేవారు కారు. అటువంటి అవసరము వారికి ఎప్పుడూ కలుగ లేదు.

తురాయి ప్రచండుడు. సింహబలుడు. ఆజాను బాహుడు విశాలమైన వక్షస్థలము కలవాడు నిరంతరమైన వ్యాయామము వలన గట్టిపడిన శరీరము గలవాడు. ఆయన నడుస్తూ ఉంటే భూమి గజగజ వణుకు తున్నదా అని అని పించేది

రాజుకూడా సామాన్యుల వలెనే దుస్తులను ధరించే వాడు. అయితే ఆయన నెత్తిపైన కిరీటం ఉండేది. రంగు రంగుల పక్షి ఈకలతో అలంకృతమైన ఆ కిరీటము అతని రాచరికాన్ని గుర్తింపజేస్తూ ఉండేది. ఆయన మాట్లాడే టప్పుడు సింహాలు గర్జించి నట్లుండేది. పర్వతాలు బ్రద్దలై పోతున్నపుడు పుట్టే భయంకర శబ్దాన్ని పోలి ఉండేది. ఆయన గట్టిగా అరిచేడా పెద్దపులులు సహితము తామున్న చోటునుండి అడుగైన కదల్పలేక పోయేవి. భయంతో వణకి పోయేవి. సింహాలు సహితము కోయదొర ఆజ్ఞను శిరసా వహించేవి.

మృగాలన్ని అడవిలో స్వేచ్ఛగా విహరిస్తాయి. కాని అవి కోయప్రజలు తిరిగే తావులకు సాధారణంగా వచ్చేవి కావు. వచ్చినా వానినిజూచి కోయదొరలు తొలగిపొయ్యే వారు. అవికూడా వాటి దారిని అవి పోతూ ఉంటవి. వీరు వాటి జోలికి పోయే వారుకారు. అవి వీళ్ళజోలికి వచ్చేవి కావు.

సింహాలు పెద్దపులులు చిరుత పులులు మొదలైనవి గ్రామాలకు దూరంగా ఉన్న భూములలో సంచరించ వచ్చుననీ, గ్రామ పరిసర ప్రాంతాలకు రాకూడదని కట్టడి.

ఒకసారి సింహము ఒకటి దారితప్పి గ్రామంలోకి వచ్చినది. ప్రజలలో గగ్గోలుబయలు దేరింది. స్త్రీలు పిల్లలూ,

భయభ్రాంతులై పెద్దగా కేకలు వేయనాగారు. కొందరు పరుగెత్తుకొనిపోయి ఆ సంగతి రాజునకు తెలియజేశారు. కోయ దొర విల్లునూ, అంబులనూ తీసికొనివచ్చి ధైర్యంగా ఆ సింహము కట్టెదుట నిలబడి "మృగరాజా! ఎందుకు ఈ ప్రాంతాలకు తమరు దయచేసినారు? మీకు ఆహారం ఏమైనా తక్కువైనదా? అట్లా అయితే ఒక పని చేయండి. ఇక్కడికి దక్షిణంగా రెండు పరుగుల దూరంలో లేళ్ళగుంపు ఒకటి ఉంది. అక్కడకుపోయి అందులోనుండి ఒక మృగమును మీరు ఆహారంగా తీసుకోండి—మీ ఆకలి తీర్చుకోండి"— అని మహారాజుతో మాట్లాడినట్లు సవినయంగా పలికినాడు. ఆ కంఠీరవము ఆ మాటలను అర్థం చేసుకొన్న దానివలె తీవిగా తలఊపి దొరచూపిన దిక్కునకు పోయిందట!

కోయలు పాములనుకూడా చంపరు. వాని జోలికిపోక పోతే అవి తమకెట్టి అపకారమును చేయవని వారి నమ్మకము. అంతేకాక పాము లెన్నిరకములో, అందులో ఏవి విషపురుగులో ఏవి కావో వారికి తెలుసు. ఆ అడవిలో గంధపు మాకులున్న ప్రాంతంలో కొండత్రాచులు తిరుగాడుతూఉంటాయి. ఇతరచోట్ల కట్లపురుగు, కప్పపులుగు, గడ్డిపాము, వానకోయిల, జెర్రిపోతు, దాసరి పాము, పరికపాము, మొదలైన క్షుద్రజాతిసర్పములుఉంటవి. వీటిలో కూడా పెంజెర మిడినాగు అనేపాములు మహా భయంకరమైనవి. అయితే ఒక్కొక్క పాము కాటుకు ఒక్కొక్క ఆకుపసరు తాగితే ఆ విషము విరిగి పోతుంది. కోయవాళ్ళకు ఈ పాముకాటుకు సంబంధిం

చిన చికిత్సకుణ్ణంగా తెలుసు. కొన్ని పాములు కాటేస్తే మంత్రం వేస్తే ఆ పాము విషము దిగిపోతుంది. ఆ మంత్రాలు తంత్రాలు మందులూ మాకులూ కోయలకు బాగా తెలుసు.

కోయలు సాధారణంగా పాములను చంపరు. కానీ మరీ అవసరమైతే ఈ క్షుద్రజాతి సర్పాలను చంపడానికి గానీ నడుము విరగగొట్టడానికిగానీ వెనుతీయరు. కాని కోయవాడు ఏ సందర్భంలోనూ త్రాచుపాము జోలికి పోడు. మృగాలలో సింహాన్ని సర్పాలలో త్రాచును వీరు ఎక్కువగా గౌరవిస్తారు. త్రాచుపాము కనుపించడంతోనే కోయదొర ఇట్లా అంటాడు. "సర్పరాజమా నీ దారిన నీవు పోవమ్మా. మేము నీకు ఎట్టి అపకారము చెయ్యము." ఈ మాటలువిని, ఏమి అర్థం అవుతుందో ఏమో, అది వెళ్ళిపోతుంది.

అట్లా అన్నప్పటికీ ఏ దుష్టుడైన సర్పరాజమో వెళ్ళిపోక కోయదొరను సమీపిస్తే, దొర పామును ఉద్దేశించి "ఓయీ దుష్టుడా! ఆగుము. కదలడానికి వీలులేదు." అని ఏదో మంత్రము చదువుతూ దానిచుట్టూ గిరిగీస్తాడు. గీసి మళ్ళీ ఇట్లా అంటాడు. "ఆ గిరిదాటి రావటానికి వీల్లేదు. మధ్యాహ్నమువరకు అక్కడే పడుండు. ఇదినీకు శిక్ష." ఆతరువాత ఆ సర్పము అంగుళమైన కదలడానికి శక్తి లేనిదై అక్కడే పడి ఉంటుంది.

ఇన్ని తంత్రాలు మంత్రాలు తెలిసినా, ఎప్పుడైనా సకృతుగా ఏ కోయ దొరసానినో, పసిపిల్లవానినో ఒక దుష్ట సర్పము కాటు వేయడము సంభవిస్తూ ఉంటుంది..

అల్లాంటప్పుడు పాము కాటు తిన్న మనిషి  నురుగులు క్రక్కుకొని స్పృహ లేకుండా పడిపోతాడు. అప్పుడు వృద్ధుడైన కోయదొరగాని వచ్చి మంత్రం వేస్తే  కాటుతిన్నవారు  నిద్ర నుంచి మేల్కొన్నట్టు లేస్తారు.

ఒకప్పుడు ఆ కాటువేసిన పామునే రమ్మని  దానిచేత విషాన్నంతా లాక్కొనేటట్లు చేస్తారు. ఆ తతంగం ఇట్లా నడుస్తుంది.

వృద్ధుడైన కోయదొర  ఒక విచిత్రమైన కేక  వేస్తే ఆ ప్రాంతాలనున్న ఉడతలు అన్నీ వస్తవి. అందులో వృద్ధుడైన ఉడతను గుర్తించి దానిని పట్టుకొని ప్రేమతో దువ్వి "స్నేహితుడా, చూశావా ఈ గాయం! ఏదో దుష్టుడైన సర్పము ఈ పని చేసింది. ఆ నుండ గొయ్యాను పిలుచుకొనిరా" అంటాడు ఆ తరువాత ఉడుతలన్నీ వెళ్ళిపోతయి. కొంతసేపటికి ఆ వృద్ధ విక్రోదము కాటువేసిన ఆ రాకాసి పామును వెంటబెట్టుకుని వస్తుంది.

భీష్మాచార్యులవంటి ఆ వృద్ధ అటవీకుడు తిప్పకాయుడైన ఆ సర్పము నుద్దేశించి "ప్రల్లరుడా  ఎంతపని  చేసినావయ్యా. నీకు ఈ మనిషి ఏమి అపకారం చేశాడని ఇంత పని చేశావు? పాడిగట్టా, నీవుచేసిన పనికి నీవే ప్రతిక్రియ చెయ్యి. ఆతని శరీరంలోకి నీవు ప్రవేశపెట్టిన విషాన్ని  అంతా తిరిగి నీవే పీల్చుకో"—అంటాడు. అప్పుడు ఆ రాలుగాయి సర్పము గాయము దగ్గర  తన నోరుపెట్టి  విషాన్నంతా  పీల్చివేసు

కొంటుంది. దెబ్బతిన్న మనిషి ఆరోగ్యవంతుడై లేచికూర్చుంటాడు. ఆ తరువాత ఆ పాము తన దారిన తాను వెళ్ళిపోయి మనిషి కను మరుగు అయిన తరువాత తన తల ఏ బండపైనో బాదుకొని ప్రాణాలు విడుస్తుందట!

ఆ సర్పరాజము తనకు జరిగిన అవమానాన్ని భరించలేకనే ఆ విధంగా ప్రాణత్యాగం చేస్తుందట! దీనిని ఉడుతరాయబారం అంటారు కోయవారు. కాని సాధారణంగాఅంత పని జరుగదు. కోయలు తమ మంత్ర తంత్రాలతోనే పాము కాటుకు గురియైన మనిషిని బ్రతికించు కొంటారు.

ఇక తక్కిన మృగాలన్నింటితోనూ కోయవారికి స్నేహమే. జింకలు, లేళ్ళు, ఎనుబోతులు, కోతులు, మొదలైన మృగాలూ, హంసలు, చిలుకలు, గోరువంకలు,కాకులు, పిచ్చుకలు, గిజిగాళ్ళు బంగారుపిచ్చుకలు మొదలైన పక్షులూ కోయ దొరలూ దొరసానులూ పిల్లలూ వీరందరూ ఒకరి భావాలను ఒకరు గ్రహించి ఒకరికి ఒకరు అపకారం తలపెట్టక స్నేహితులవలె కలిసి మెలసి జీవిస్తూ ఉంటారు ఆ అడవిలో.

# క్లింగ్ లింగ్ ల కథ

## వంశధారా నది

శబర రాజ్యపు స్థితి ఆవిధంగా అయిందని కోయ రాజ్యపు ప్రజలకు తెలియదు. ఆ రెండు రాజ్యాలకు మధ్య వంశధారానది అడ్డుగా గంభీరంగా ప్రవహిస్తూ ఉండడమే దానికి కారణము. వంశ ధారానదిని దాటి శబర రాజ్యంలోకి ప్రవేశించడానికి ఎవ్వరికీ పనిలేదు. ఆ రెండూ స్వతంత్ర రాజ్యాలు. ఒకరిరాజ్యంలోకి ఇంకొకరుఅనవసరంగా రాకూడ దనే నియమాన్ని వారు చాలాకాలం క్రిందనే ఏర్పరచు కొన్నారు.

కాని వంశధారానది ఒక సంవత్సరం ఇసుక లంకలను పెట్టింది. అవి మొదట చిన్నవిగానే ఉండేవి. కాని ఆ నది ప్రతిసంవత్సరం కొంత ఇసుకను ఆ దిబ్బలపై చేరుస్తూఉండేది రెండు మూడేండ్లలో ఆ దిబ్బలు పెద్దవైనవి. వాటిపై ఒండు మట్టికూడా బాగా పేరుకొంది. ఆలంకలు వ్యవసాయ యోగ్య ములనీ అక్కడ పైరు వేస్తే పుష్కలంగా పండుతుందని" కొందరు కోయలకు తోచింది. వారు ఆ సంగతి ప్రభువుకు చెప్పినారు.

"అలంకలు మనవి కావు. అవి శబర రాజ్యం వైపు ఉన్నవి. వంశధారా నదిలో ఇటుసగం మనది. అటు సగం శబరులది. ఈ లంకలు అటుసగంలో ఉన్నవి కాబట్టి వాటిలో ప్రవేశించడానికి మనకు ఏవిధమయిన హక్కు లేదు. మనం ఆ లంకలో ప్రవేశిస్తే శబర భూపతికి కోపం వచ్చి ఆయన మన పయి దండెత్తి రావచ్చును. లేనిపోని తద్దినం ఎందుకు తెచ్చి పెడతావయ్యా" అని అన్నాడు రాజు ఆ విషయం తనతో ప్రస్తావించిన కోయ దొరతో విసుగ్గా.

కోయదొరలు శాంతిప్రియులు వారు యుద్ధం చేయ డంలో నేర్పు కలవారేగాని అనవసరంగా ఇతరుల జోలికి పోరు అన్యాయంగా ఎప్పుడూ ప్రవర్తించరు.

కొన్ని సంవత్సరాలు గడచిపోయినవి. ఆ లంకభూము లను ఆక్రమించుకొంటానికి శబరులు ఎటువంటి ప్రయత్నమూ చేయలేకపోవడంవలన కోయదొరలే కొందరు ఆ లంకభూము లను ఆక్రమించుకొన్నారు ధైర్యంచేసి. అక్కడ వ్యవసాయం చేసినారు. శబరరాజునుండి ఎటువంటి అభ్యంతరం రాలేదు. లంకభూములు బాగా పండినవి. కోయదొరలు ఐశ్వర్యవంతు లైనారు.

ఒకొక్కప్పుడు కోయదొరల పశువులు కొన్ని వంశ ధారానదిని దాటి శబరరాజ్య సరిహద్దులలోకి పోవడము జరి గింది. వాటిని మళ్లేసుక రావడానికి కోయలు వెళ్ళినారు. అక్కడి స్థితిగతులను చూశారు. ప్రతిప్రాణి నిర్జీవంగా పడి ఉండడం గమనించారు. సింహాలూ, పులులుకూడా కదలలేక

పడిఉండడము చూచి ఇదేమిటని ఆశ్చర్యపడి దగ్గరకెళ్ళిజూస్తే ఉచ్ఛ్వాస నిశ్వాసములు కట్టుబడిపోలేదు. వాటి ప్రాణాలు పోలేదని వారు గ్రహించారు. అవి మేల్కొంటవేమోనని మొదట్లో వాటికి దూరదూరంగా ఉన్నారు కాని అవి లేవడం జరుగలేదు. ఒక సంవత్సరం గడచినా వాటిలో చైతన్యం కలుగలేదు. ప్రాణికోటి అంతా ఆ విధంగా మాయనిద్రలో పడిఉండడము ఏదో మంత్రప్రభావమేనని కోయలకు నమ్మకం కలిగింది.

తరువాత కొందరు కోయప్రముఖులు శబర రాజ్యపు ముఖ్యనగరంలోనికికూడా పోయి చూశారు. అక్కడ కూడా జనం ఎక్కడవాళ్ళు అక్కడ నిశ్చేష్టులై పడియున్నారు. వారి చుట్టూ ముళ్ళపొదలు పెరిగినవి. అంతటా మనుష్యులు మనుష్యులుగా పడిఉన్నారు. ఏ ప్రాణిలోనూ జీవ చైతన్యం లేదు. "ఇది శాపగ్రస్తమైన దేశము. ఏ దేవతకో కోపంవచ్చి ఈ దేశాన్ని శపించి ఉంటుంది" అని గ్రహించి వారు వెంటనే వెళ్ళి తమ రాజైన తురాయితో ఈ విషయం అంతా చెప్పినారు. తురాయి చాలా దుఃఖించి శబరులను శాపవిముక్తులనుగా చేయడం ఎల్లాగా అని ఆలోచించసాగాడు. ఈ విషయమై కామదేవ గురుదేవులతో చెప్పి వారి సలహాను పొందవలయునని తురాయి నిశ్చయించుకున్నాడు.

# శబరరాజ్యా[illegible]

## క్లింగ్

వారిలో కొం[illegible]మంది ఆడపిల్లలు వారివారి వయస్సునకు తగ్గ ఆటలు ఆడుకొంటున్నారు. మరీ చిన్నపిల్లలు అల్లిబిల్లి, ఓమన గుంటలు, [illegible], గిలిగింతలు, దూబూచులు, సరిబేసులు, చిటిక [illegible], కాలి కంచము, గచ్చకాయలు, గుంటచా[illegible], [illegible], చక్రాల త్రిప్పుడు మొదలైన ఆటలు ఆడుతున్నారు. అంతకంటె కొంచెము పెద్దపిల్లలు, కుమ్మరి [illegible], [illegible], కోతి గానుగ, గొబ్బి[illegible], చిర్రా బిళ్ళ, చీకటి గుడిపిల్లి, చెండు, తన్నుబిళ్ళ, పుట్టచెండు మొదలైన ఆట ఆడుచుంటున్నారు.

5]

వారినారి కేకలు అరుపులు, ఈలలు, కూతలు, కిచకిచ, బొబ్బలు, గో డ్పింతలు, గోటరింపులు, వీటితో ఆ లంకఅంతా మారుమ్రోగిపోతున్నది.

ఈ బాలురకు కొంచెం దూరంలో పదునెనిమిదేండ్ల వాడునూ మెలితిరిగిన కండరములు కలవాడును అందమైన వాడును అయిన బాలుడొకడు సింహముతో ఆడుకొంటు న్నాడు. అతని తోడివారిలో కొందరు ఆతని సాహస కృత్యా లకు ఆనందాన్ని వెలిబుచ్చుతున్నారు. కొందరు నవ్వుతు న్నారు. కొందరు సంతోషంతో గెంతుతున్నారు. కొందరు పాడుతున్నారు.

ఆ యువకుడు బలిష్టుడు. ఆతని దేహము చామన ఛాయలో మిగమిగ మెరుస్తూ ఉంది. ఆ బాలుడు పొడవై స్నిగ్ధములైన తన కేశములను పైకెగదువ్వి నడినెత్తిని ముడి పెట్టుకొన్నాడు. ఆ కేశ బంధాన్ని పూలమాలలతో అలంక రించుకొన్నాడు. ఆతను తెల్లని ముతుక వస్త్రాన్ని ఒకదానిని ధరించినాడు. ఎఱ్ఱని రుమాలాను నడుముకు బిగియకట్టినాడు. ధగధగ మెరుస్తూఉన్న రత్నములతో పొదుగబడిన సువర్ణ వలయము నొకదానిని సందిట పెట్టుకొన్నాడు. బంగారు చిరుగజ్జెల మొలత్రాడు అతని కటిస్థానాన మెరుస్తూ ఉన్నది.

ఆబాలుడే యువరాజు. కోయరాజ్యానికి అధిపతియైన తురాయ్ కుమారుడు. ఆతడు అధిక శౌర్యవంతుడూ ధూపసి. అతనిపేరు క్లింగ్.

క్లింగ్ రాజకుమారుడు ఆ సమయాన సింహముతో చెరలాటలాడుతున్నాడు. దానివెంటబడితరిమి పట్టుకొన్నాడు. దాని వీపుపైకెక్కి స్వారి చేశాడు. తక్కిన బాలకులంతా గుఱ్ఱాలపైనెక్కి ఆతనిని అనుసరించారు.

కొంతసేపు అయిన తరువాత క్లింగు సింహముపైనుండి క్రిందికి దూకి దాని జూలను దువ్వి, మీసాలను సర్ది వీపుపై స్నేహపురస్సరముగ చరిచాడు. సింహము పెంపుడు కుక్కవలె సాధువై అతడు చెప్పినట్లు విన్నది. ఆ తరువాత దానిని పంపివేసినాడు.

ఆ తరువాత క్లింగ్ రెండు మువ్వన్నె మెకములపైకెక్కి స్వారి చేశాడు. ఆ రెంటిలో ఒకటి తన సహజ స్వభావమును చూపిస్తూ బాలుణ్ణి తన పంజాతో కొట్టబోయింది. బాలుడు చెంగున ప్రక్కకు దూకి దాని దెబ్బను తప్పించుకున్నాడు. ఆ పెద్దపులి భయంకరంగా అరుస్తూ కొంచెము వెనుకకు తగ్గి, పుంజుకుని అతనిపైకి దూకింది. క్లింగ్ ఏమాత్రమూ భయపడలేదు. దానితో పోట్లాడడానికే సిద్ధపడ్డాడు. వారిద్దరికి పది నిమిషాలు పోట్లాట జరిగింది. బెబ్బులి విసిరే పంజాదెబ్బలను క్లింగు బహు నేర్పుతో తప్పించుకుంటూ, దానిని పిడికిలితో బాదుతూ వెనుకకు తోస్తూ ముందుకాళ్ళను పట్టుకొని ఎత్తి వెల్లకిలా పడేస్తూ చాలాసేపు పోట్లాడాడు. బాలుని శరీరంపైన రెండుమూడు గాయాలయినవి. ఆ గాయాలవెంట రక్తం కారుతున్నా ఆతడు లెక్కచేయకుండా పోరు సాగించాడు.

చివరకు ఒక బలమైన ముష్టిఘాతానికి తట్టుకోలేక ఆ పెద్దపులి తోకముడిచి పారిపోయింది.

క్లింగ్ స్నేహితులు ఏవో ఆకు తెచ్చి పసరుపిండి ఆ గాయాలకు పూశారు. గాయాలు సలుపడము మానినవి. ఇది అతని ఆట.

ఆ వనవాస పిల్లలంతా కలిసికొని ఒక పెద్ద వటవృక్ష ఛాయను సమావేశమై అక్కడ ఉన్న రాతి బండలపై కూర్చున్నారు. [illegible] [illegible]. వారు క్లింగుతో "మాకు ఆకలి అవుతున్నది పళ్ళు ఇక్కడకు తెప్పిస్తావా?" అన్నారు.

క్లింగ్ "ఇక్కడకేం? కావలసినన్ని పళ్ళు అవి ఇక్కడికే తెప్పిస్తాను" అని ఒక విచిత్రమైన కేక వేశాడు. ఆ కేక ఒక క్షణం మారుమ్రోగా వినిపించింది. [illegible] ఎక్కడి నుంచి వచ్చిందో కాని ఒక కోతుల మూక వచ్చిపడ్డది. అందులో రక్తముఖులూ, శ్వేతముఖులూ ఉన్నారు.

ఆ మర్కటాలు వచ్చి సభకు వచ్చిన పెద్ద మనుష్యుల వలె రాజకుమారులవలె [illegible] రాతిబండలపైన చెట్ల కొమ్మలపైన కుదురుగా కూర్చున్నవి. క్లింగు వాటిని ఉద్దేశించి ఏవో కొన్ని మాటలు చెప్పినాడు. ఆ కోతులన్నీ ఆ మాటలను చెవులు నిక్కపొడుచుకొని విన్నవి. అనికొంచెము సేపు కిచకిచలాడి ఎక్కడికో వెళ్ళిపోయినవి.

తరువాత క్లింగు అక్కడే ఒక రాతిపైన నడుమువాల్చి ఒక పాట పాడాడు. వెంటనే కోయిలలూ, గోరువంకలూ,

చిలుకలు, బంగారు పిచ్చుకలూ మొదలైన రకరకముల పక్షు లన్నీ వచ్చి అతని సమీపంలో వ్రాలినవి. కొన్ని కిచకిచలాడి నవి. కొన్ని అతని చుట్టూ తిరిగినవి. కొన్ని వయ్యారాలు వలకబోస్తూ విహరించినవి. లింగ్ కొన్నింటిని దగ్గరకు తీసి దువ్వి ముద్దు పెట్టుకొని పంపివేశాడు.

ఇంతలో మర్కటాలన్నీ తిరిగివచ్చినవి. కొన్ని మామిడి పండ్లను, కొన్ని వెలగపండ్లను, కొన్ని కొబ్బరికాయలను కొన్ని అరటిగెలలను తెచ్చినవి. ఆ పళ్లు అన్ని బాలునిముందు ఉంచి, ఆ ప్రాంతముననున్న చెట్ల కొమ్మలపై కూర్చున్నవి. రామచంద్రుని చుట్టునూ చేరిన వానర పరివారమును జ్ఞప్తికి తెస్తుంది ఆ దృశ్యము.

యువరాజూ ఆతని స్నేహితులూ ఆ పండ్లను కావలసి నంతవరకు తిన్నారు. తిని ప్రక్కనేఉన్న సెలయేటినీరు తాగారు. వారి ఆకలి తీరింది. ఇంకా బోలెడు పళ్లు మిగిలిపోయినవి. ఆ వానరసమూహము తెచ్చిపడవేసిన ఫలసంపత్తిని అంతా రాజ భవనానికి చేర్చాలంటే చాలామంది సేవకులు కావాలి. రాజ కుమారునికి సేవకులు లేకపోలేదు. కాని ఆయన తన కోతు లనుఉద్దేశించి "స్నేహితులారా! ఇవన్నీ కోటలోనికి చేర్చండి. అజ్ఞానులైన పిల్లలు ఎవరైనా మీమీద రాళ్ళు రువ్వవచ్చు. అప్పుడు మీరు కోపము తెచ్చుకోక ఆ బాలురకు కావలసిన పళ్ళు ఇచ్చి సంతోషపెట్టండి" అని చెప్పాడు. ఆ మాటలన్నీ ఆ మర్కటాలు అర్థంచేసికొని తలలూపి ఆయన చెప్పినట్లు చేసినవి.

క్లింగు రాజకుమారుడు ఆ విధంగా ఆటపాటలతో కొంతకాలం గడిపి, తన స్నేహితులతో కలిసి గూడెంలోకి పోయినాడు. అప్పటికి చీకటి పడ్డది. దూరాన్నుంచి పులులు, సింహములు గర్జించడం వినిపించసాగింది.

## క్లింగ్ - లింగ్‌ల కథ

### తురాయి రాజు

ఒక రోజున వృద్ధుడైన తురాయిరాజు కుమారునిపిలిచి శిరముపై గోముగా దువ్వి ఇట్లా అన్నాడు— "నాయనా నీవు ఇరవై సంవత్సరములవాడవైనావు. ఇక ఈ రాజ్యమును నీవే పాలించవలసి ఉంటుంది. మన కుల మర్యాదలనూ కట్టు బాట్లనూ నీవు పెద్దలనుండి గ్రహించు."

"నాయినా ఇంకొక సంగతి నీవు తెలిసికొన తగినది ఉన్నది. మన వంశమునకు మూలపురుషుడైన చిత్రగాయకుడు చిత్కళను వివాహం చేసికొన్నాడు. ఆ పవిత్రదంపతుల సంతతివారమే మనము. ఆ వంశములో నేను నాల్గవవాడను. నీవు అయిదవవాడవు".

"చిత్రగాయకుడు శివభక్తుడు. నామదేవుడను ఋషి చిత్రగాయకునికి శివమంత్రము ఉపదేశించినాడు. తరువాత నేను నామదేవుడను ఋషివలననే ఉపదేశమును పొందినాను. మన వంశములో ప్రతివాడును శివభక్తుడే. మన పెద్దలంత

రును నామదేవుని వలననే ఉపదేశమును పొందినారు. నీవును శివభక్తుడవు కావలయును."

"ఈ ప్రపంచమంతయు శివమయము. వన్యమృగాలతో నీవు ఆడుకొనుట నేను చూచినాను. నీకు అవి వశమైనవి. అటువంటి క్రూర జంతువులు నీకు వశం కావడానికి కారణం నీకు తెలియదు. పరమశివుని ప్రమధగణమే పులులుగా, సింహములుగా, తోడేళ్ళుగా, ఎలుగులుగా అవతరించినవి. అందుచేతనే శివభక్తుడవైన నీకు అవి వశమైనవి. శివ విభూతి కలిగినవారికి ఎట్టిలోపమునూ రాదు. నాకు ఉపదేశము చేసిన గురుదేవులు నామదేవుడు. ఇప్పుడు ఆయన మూడువందల ఏండ్ల వయస్సు కలవారు. ఆ ఋషిపుంగవులు సువర్ణసరోవర ప్రాంతమున నేటికిని సజీవులైయున్నారు. నీవు వారి దర్శనము చేసి మంగళకరమైన శివమంత్రము నొకదానిని ఉపదేశింపుమని ప్రార్థింపుము. నీకు సకల ఐశ్వర్యములూ కలుగగలవు. మునిపుంగవుని ఆశీర్వాదముపొంది వచ్చిన తరువాత, ఈ రాజ్యభారమును నీవే వహింతువుగాని" అని తురాయ్ తన కుమారునితో చెప్పినాడు.

ఆ ముసలిరాజు కొంచెముసేపు ఆగి మళ్ళీ, "నాయనా మన పొరుగురాజ్యము శాపగ్రస్తమై యున్నది. జనులందరును శాపమాహాత్మ్యమువలన మత్తులో పడియున్నారు. అది చాలా విచిత్రమైన విషయము. ఈ విషయమై గురుదేవులతో ప్రస్తావించు. వారిని పునర్జీవింపచేయుమని వారిని ప్రార్థించు. వారి కృప కలిగితే అసాధ్యమనేది ఏదీ ఉండదు." తండ్రి చెప్పిన

విషయాలన్నీ క్లింగు శ్రద్ధగా విని ఆయన చెప్పినట్లు చేయుడానికి అంగీకరించినాడు.

## వామదేవుడు

గురుదేవులు చాలా ముసలివాడు. ఆయన వయస్సు మూడువందల ఏండ్లనీ అంతా చెప్పుకొంటారు. కనుబొమలు నెరసి క్రిందికి వాలినవి. తల ముగ్గుబుట్ట అయింది. కాని ఆయన దృష్టికి ఏమీ లోపం రాలేదు. దంతసౌష్టవమూ, పటుత్వమూ చెడలేదు. ఆయన సువర్ణసరోవర ప్రాంతాన ఒక వటవృక్ష ఛాయను కూర్చుండి తపస్సు చేసుకొంటున్నాడు.

క్లింగు వచ్చేసరికి ఆయన తపస్సు చేసికొంటున్నారు. ఆయన తపస్సునుంచి లేచి కళ్లు తెరిచేవరకు ఆయనకు ఎదురుగా కూర్చున్నాడు క్లింగు. ఒకగంట గడిచిన తరువాత మహాఋషి కళ్ళువిప్పి, రాకుమారుని చూచి మందహాసం చేశాడు. క్లింగు ఎందుకు వచ్చింది ఆ మహాఋషి దివ్యదృష్టిచేత గ్రహించి "నీవు నిన్ననే రావలసిందికదూ?" అన్నాడు.

క్లింగు ఆశ్చర్యచకితుడు అయినాడు. దారిలో అడ్డం వచ్చిన ఒక కొండవాగు, అంతకు క్రితం రాత్రి కురిసిన వర్షం వలన, పొంగి వరదలలో ఉండడంమూలాన తాను రాలేకపోయినాడు. క్లింగు ఆశ్చర్యముగ్ధుడై ఏమీ చెప్పలేక నమస్కరించి ఊరుకొన్నాడు.

గురుదేవులు ఇట్లా అన్నారు. "అవునయ్యా, దారిలో ఏరు ఒకటి నిండు వరదల్లో ఉండడమువల్ల నీవు రాలేకపోయి నావు. మంచిపనే అయింది. నీవు సాహసించి నీటిలోదిగి ఈదుకుంటూ, నదిని దాటి వచ్చినట్లయితే చాలా చిక్కులో పడేవాడవు. ఎందుకంటే నరమాంసమును రుచిచూచిన పెద్ద పులి ఒకటి నీకు అడ్డంతగిలేది. సింహముగాని పెద్దపులిగాని ఒకసారి మనుష్య మాంసము రుచిచూచిందా, ఇక వదలదు. అది ఎప్పుడూ నరమాంసముకోసమే ప్రయత్నిస్తుంది. అయితే దానిని హతమార్చడానికి నా యోగబలం నీకు లభించేది అనుకో. అయినా చాలా కష్టపడవలసి వచ్చేది. నీవు శివాంశ కలవాడవు కనుక నీకు ఎటువంటి ఆపదా రాదు. నీకు ఆరక్షణ ఎప్పుడూ ఉంది. అయినా నీ తండ్రి నిన్ను నావద్దకు ఎందుకు పంపినాడో నాకు తెలుసు. రేపు నీకు ఒక మంత్రం ఉపదేశం చేస్తాను. ఒక్కొక్క మంత్రానికి ఒక్కొక్క అధిదేవత ఉంటుంది. ఆ దేవతను ఒక నిర్ణీత సమయంలోనే ఉపాసన చేయాలి. నేను చెప్పబోయే మంత్రానికి అర్ధరాత్రము అను కూలమైన వేళ. ఆ మంత్రాధిదేవత ప్రీతికొఱకు నీవు కొన్ని నియమాలు పాటించాలె. కొన్ని నైవేద్యాలు చెయ్యాలె. ఆ కట్టుబాట్లు అన్నీ నీవు పాటించగలవు అనే ధైర్యం నాకు ఉంది. అయితే ఆమంత్రాన్ని నీవు రోజూ పఠించనక్కరలేదు. సంవత్సరమునకు ఒక్కసారి అమావాస్య రోజున అర్ధరాత్రి మున నీవు ఆ మంత్రాన్ని పునశ్చరణ చేయాలె. మిగిలిన

రోజులలో నియమాలు పాటిస్తూ ఆ దేవతకు ధూపదీప నైవేద్యాలు మాత్రము జరుపుతూ ఉండాలె.

క్లింగు కృతజ్ఞతతో నమస్కరించి "స్వామీ మీ అనుగ్రహానికి పాత్రుడనైనాను. నా జీవితము చరితార్ధత పొందినది. నాకు ఇంకేమి కావాలె?" అన్నాడు.

ఆ తరువాత గురుపాదులు కొంచెంసేపు మౌనం వహించారు. శబర దేశ ప్రశంస ఎట్లా తెద్దామా అని క్లింగు తికమకలు పడుతున్నాడు. ఇంతలో దేవర మందహాసం చేసి, "శబర రాజ్యము విషయమై మీ తండ్రి ఆందోళన పడుతున్నాడు. నీవూ ఆవిషయమే అడగవలెనని అనుకొంటున్నావు. అంతే కదూ?" అన్నాడు.

క్లింగు ఆయన త్రికాలజ్ఞతకు అంతులేని ఆశ్చర్యాన్ని పొందాడు. ఋషిపుంగవుడు క్లింగుతో ఈవిధంగా అన్నాడు. "నాయనా మీ పొరుగునఉన్న శబరరాజ్యము, ఒక నీచ దేవత ఇచ్చిన శాపానికి గురియై ఉన్నది. నేను నీకు మరొక మంత్రం ఉపదేశిస్తాను. నలుబదిరోజులు నీవు ఆ మంత్రాన్ని జపించాలె. అల్లా జపిస్తే నీవు శక్తి సంపన్నుడవు అవుతావు. ఆ మంత్రంబలం నీకు ఉన్నప్పుడు ఏ నీచ దేవతా నిన్ను ఏమీ చేయ లేదు. ఆమెకు నిన్ను ప్రతిఘటింప శక్తి ఉండదు. అప్పుడు నీవు శబర రాజ్యానికి విముక్తి కలుగజేస్తావు.

కాని ఆ శక్తికి నీచమైన ఆగ్రహం వస్తుంది. నీవు ఆ మంత్రాన్ని జపించకుండా ఉండడానికి అనేక ప్రయత్నాలు చేస్తుంది. నిన్ను రకరకాలుగా భయపెడుతుంది. నక్కలూ,

తోడేళ్ళూ, పులులూ అరచినట్లూ, సింహాలు గర్జించినట్లూ ఎక్కడనుంచో శబ్దాలు వినపడుతవి. నీ జప నిష్టకు భంగం కలుగజేయడానికి ఇంకా ఎన్నో విపరీతాలు ఆ దేవత కలుగజేస్తుంది. నీవు ఉన్న ఇల్లు విరిగి నీమీద పడుతున్నట్లూ, భయంకరమైన సర్పములు నీ ఒడలిపై ప్రాకుతున్నట్లూ నీకు భ్రమ కలుగుతుంది. నీవు జపంమానినావా, ఆ శక్తికి లొంగిపోయినట్లే! ఆ తరువాత ఆ మంత్రం నీకు సిద్ధించదు. ఏమైనా సరే నీవు మంత్రాన్ని పునశ్చరణ చేయడం మానకూడదు.

ఆ తరువాత చివరప్రయత్నంగా ఆమె నీఎదుట భయంకరరూపంతో ప్రత్యక్షమౌతుంది. ఎర్రనినాలుకను ముందుకు సాచి, నెత్తురు ఓడుతున్న కత్తి పట్టుకొని నీ ముందు నిలువబడి వికటాట్టహాసం చేస్తుంది. నీమీద నెత్తుటివర్షం కురుస్తుంది. ఎముకలతో నీ శరీరం తాడితము కావచ్చు. ఏమైనసరే నీవు చలించకూడదు. నీ ధ్యాననిష్టకు భంగం కలుగకూడదు. మరీ భయంకలిగితే, నీవు ఆమంత్రాన్ని పెద్దగా ఉచ్చరించు. నిన్ను ఆ దేవత ఏమీ చేయలేదు. కాసేపు భయపెట్టి వెళ్ళిపోతుంది. ఆమె వెళ్ళిపోతూపోతూ నీకు అప్తులైనవారి గొంతుతోనో, నీ తల్లిగొంతుతోనో నిన్ను లేచిరమ్మని తానేదో ఆపదలో చిక్కుకొని, నీ సాయం కోరుతున్నట్లూ అరుస్తుంది. ఇంకా ఏమి విచిత్రమైన పనులుచేస్తుందో, ఎన్నివిధాల నిన్ను లొంగతీయాలనిచూస్తుందో నేను చెప్పలేను. నీవు ఈ సంఘటనలను అన్నిటికి తట్టుకుంటే, నీకు జయం లభిస్తుంది.

ఈ విధంగా నలభై రోజులూ జపం జరిగిన తరవాత, నీ ఇష్టదేవతను ప్రార్థించి ఆమె తృప్తి కోసం అనేక మద్యవిశేషాదులను నైవేద్యం చేసి, అనంతరం వాటిని మీరు త్రాగండి. తరువాత సాహసులునూ, ధైర్యవంతులునూ అయిన కొంత మంది అనుచరులతో నీవు శబర రాజ్యంలోకి పోవచ్చును.

అయితే మొదట నీవు ఎవరిని తాకవద్దు. రాజధాని నగరంలో ఒక విశాలమైన కుటీరంలో రాజకుమార్తె నిద్రిస్తూ ఉంటుంది. ఆమెను మాత్రము తట్టి నిద్రలేపు. ఆమె నిద్ర నుండి లేవడంతోనే ప్రాణికోటి అంతా ఒక్కసారి నిద్రనుండి మేల్కొంటుంది. రాకుమారి నిన్ను భోజనం చేయమని బల వంతపెడుతుంది. మధుర పానీయములను ఇస్తుంది. నీవు ఏమీ తినకు; తాగకు. మూడు రోజులపాటు నిద్రాహారములను మాని, ఆ మంత్రాన్ని జపిస్తూ ఉండాలి. ఆ తరువాత నీ ఇష్టం వచ్చిన రీతిని సంచరించవచ్చు. ఎవ్వరికీ ఏ ఆపదా రాదు."

"శబర రాజకుమార్తె ఎంతో చక్కనిది. ఆమె నిన్ను ప్రేమించి వివాహం చేసుకోమంటుంది. నీవు దానికి అంగీకరించు. ఈ వివాహము దైవ నిర్ణయము." ఈ మాటలన్నీ రాకుమారుడు జాగ్రత్తతో విన్నాడు.

ల్లింగు ఆ తరువాత మంత్రోపదేశాన్ని పొంది గురువు గారివద్ద సెలవు తీసుకొని స్వదేశానికి వచ్చి, జరిగిన సంగతి అంతా తండ్రికి విన్నవించినాడు.

# క్లింగ్ - లింగ్ ల కథ

శాపవిముక్తి

తరువాత తండ్రియాజ్ఞను అనుసరించి క్లింగు గురువుగారు చెప్పినట్లు దీక్షితుడై మంత్రమును జపించడం ఆరంభించినాడు. ఆయనకు తన మంత్రోపదేష్ట చెప్పిన సర్వవిషయాలు జ్ఞాపకం ఉన్నవి. అన్నిటిని తు. చ. తప్పకుండా ఆచరించాడు.

నలభయి రోజులు జపం చెయ్యవలె క్లింగు చిన్నవాడు. అతడు నిష్ఠాపరుడై జప తత్పరుడై కార్యాన్ని సాధించగలడా? ఎప్పుడు భయపడుతాడో! ఎప్పుడు అతని ధ్యాననిష్టకు భంగం కలుగుతుందో! కలిగితే ఏమి అరిష్టాలు సంభవిస్తవో అని తురాయి అక్కలి పడసాగాడు. క్లింగును వేయికళ్ళతో కనిపెట్టి చూస్తూఉండమని తన సేవకులకు ఆజ్ఞ ఇచ్చినాడు. తన కుమారుడు జపము చేస్తున్నచోటికి ఎవ్వరూ పోరాదని కట్టడి చేశాడు. క్లింగు కూర్చున్న గదికి నాలుగువైపులా ధైర్యవంతులైన నలుగురు యోధులను కాపుంచాడు.

క్లింగు నలభయి రోజులూ మంత్రాన్ని జపించాడు. అతని ఏకాగ్రతకు ఎలాంటి భంగం కలుగలేదు మంత్రాధిదేవత సాక్షాత్కారము కూడా జరిగింది. సాచిన, ఎఱ్ఱని నాలుకతోనూ రక్తసిక్తమైన ఛురికతోనూ ఆమె సాక్షాత్కరించి అతని శిరస్సును సహస్ర వ్రక్కలు చేస్తానని బెదిరిం

చింది. భూత ప్రేత పిశాచాదులు ఆతనిముందు వికటాట్టహాసము చేసినవి. కాని క్లింగు జంకలేదు, తొణకలేదు. మంత్రాన్ని బిగ్గరగా అనుష్ఠించినాడు. నక్కకూతలూ, తోడేళ్ళ అరుపులూ, సింహగర్జనలూ వినిపించినా ఆతడు లెక్కచేయక విశ్వాసంతోనూ, ధైర్యంతోనూ, నిష్ఠతోనూ ఆ మంత్రాన్ని జపించాడు. క్లింగుకు మంత్రనిష్ఠమైన శక్తి లభించింది.

ఆ జపం అయిపోయిన తరువాత ఇష్టదేవతకు పూజలు నైవేద్యాలు జరిగినవి. ఇప్పుడు ఆతడు అధిక శక్తిమంతుడు అయినాడు. శబర రాజ్యాన్ని శాపదగ్ధంచేసిన దేవతను సర్వ నాశనం చేయగల శక్తిని క్లింగు సంపాదించాడు.

అటుపిమ్మట క్లింగుతన అనుచరులతో శబరదేశంలో ప్రవేశించి గురుదేవులు చెప్పినట్లు చేశాడు.

శబరరాజు కుటీరంలో ప్రవేశించి, లింగ్ రాజకుమారెను నిద్రనుండిలేపాడు. వెంటనే ఆమె నిద్రనుండి మేల్కొన్నట్లు లేచి, క్లింగు రాకుమారునిపై చిరునవ్వులు ఒలకపోసింది.

వెంటనే ప్రకృతి అంతా చైతన్యవంతమైంది. నూతన జన్మ ఎత్తినట్లు శ్వాసించింది. అప్పుడు తెలతెలవారుతున్న సమయము. కొంచెం సేపటిలో సూర్యోదయమైంది. ప్రాత స్సూర్యాతప రామణీయకతతో దేశమంతా కళకళలాడింది. పిచ్చుకలు, చిలుకలు, గోరువంకలు కిచకిచలాడినవి. వాసర సమూహముల కిలకిలా రావముల ఆర్భాటము ఎక్కువైంది. కోయిలలు క్రొత్తగా చిగురులనుమేసి రసాల తరుశాఖాగ్రము

నెక్కి, శబరదేశము పరమేశ్వరుని కృపవలన శాపమునుండి విముక్తమైనదని పంచమ స్వరమున పాటలు పాడినవి. ముకిళించుకొని వాడిపోయిన పుష్పాలన్నీ ఒక్కసారి కనులువిప్పి, ఆనంద తరంగితలైనవి. వాయువులు వీచినవి. క్రొత్తగా వికసించిన పుష్పముల పరిమళములను గంధవాహుడు అందరికి పంచిపెట్టినాడు. తుమ్మెదలు ఝుమ్మంటూ వృక్షసంతానమునకు అంతకును శబరదేశము పరమేశ్వరానుగ్రహీత అయినట్లు చెప్పినవి. తమకా విషయము ముందే తెలుసునన్నట్లు తాళవృక్షములు తలలూపినవి. సీతాకోక చిలుకలు చుక్కల చుక్కల చీరలను ధరించి, పరిమళగంధమును పూసుకొని పువ్వుపువ్వు వద్దకూ పోయి, పలుకరించి ఈ శుభవార్త చెప్పినవి.

ఎప్పటివలె వాగులలోనూ, ఏరులలోనూ నీరు ప్రవహింప ప్రారంభించింది. అవి సంతోషంతో పొంగిపోయి ఒడ్డుల నొరిసికొని పారినవి. శబరదేశాన్ని గురించిన యీ శుభవార్త సముద్రానికి చెప్పాలని వాగులు, వంకలు, సెలఏరులు తత్తరపడి వేగముగా పరుగెత్తసాగినవి. చిన్నవాగులు సంతోషంతో పొంగి నదులైనవి. చిన్ననదులు సంతోషంతో గంతులువేస్తూ ప్రవహించినవి. ఆనందంతో పరవళ్లు త్రొక్కినవి. కొన్ని ఒడలు తెలియని సంతోషంతో కొండకొమ్మల నుండి క్రిందికి దూకినవి. వంశధారానది శివజటా జూటికానర్తకి అయిన భాగీరథీ సదృశఅయి శబరరాజ్య ముఖ్యనగర పార్శ్వములను ఒరసికొని పారినది.

జనులందరి మొగములలోను ఆనందము తాండవించినది. పరమేశ్వర కృపా ప్రభావమువలన దేశమంతయు తిరిగి చైతన్యవంతమైనది. శబరులందరూ నిద్రనుండి మేల్కొన్నట్లు లేచి తమతమపనులు చూచుకోవడం మొదలుపెట్టారు. కొన్ని సంవత్సరాలు నిద్రపోయినామని వారికి తెలియనే తెలియదు. వారు గాఢనిద్రనుండి లేచినట్లు సుఖానుభూతిని పొందినారు. క్లింగు శబర రాజ్యములో కొన్ని రోజులుండి తిరిగి స్వదేశానికి వచ్చినాడు. ఒకదినాన దేశములోని కొందరు పెద్దలతోనూ, పురప్రముఖులతోనూ, తురాయి శబరరాజ్య ముఖ్యనగరానికి పోయి లింగ్ రాజపుత్రికను తన కుమారునికిచ్చి వివాహంచేయమని రింగ్‌రంగ్‌ను అర్థించినాడు. రాజు అందుకు సంతోషంతో అంగీకరించాడు.

# శబర రాజ్యము

## క్లింగ్ లింగ్‌ల వివాహము

బొయ్యాలు శకునాలుచూచి, నక్షత్రబలాన్ని లెక్కించి ముహూర్తాన్ని నిర్ణయించారు. క్లింగు యువరాజును పెండ్లికొడుకును చేశారు. కోయదొరలు మేళతాళాలతో వంశధారానదిని దాటి శబర రాజధానికి పోయినారు. అప్పటికే శబరులు వివాహమునకు సర్వప్రయత్నాలు చేసికొని సిద్ధముగానున్నారు.

ఒక పెద్ద వట వృక్షచ్ఛాయను పెళ్ళిపెద్దలంతా సమావేశమైనారు. మర్రి ఊడలను కొండ అరటి ఆకులతో అలంకరించారు. ఆ భాగానికి చుట్టునూ గానుగ చెట్ల వలయమున్నది. ఆ చెట్ల ఆకులపై ఉదయ భానుని లేత కాంతులు పడి తళ తళ మెరిసినవి. దూరాన నల్లటి తాటి చెట్లు, గుచ్చి నిలువబెట్టిన అగరుకడ్డీల వలె ఉన్నవి. కొంచెము దూరంలో సెలయేరు జలజలా ప్రవహిస్తున్నది.

ఆ పెండ్లికి ఇరువైపుల వారూ బంధుజనం అంతా వచ్చారు. బంధుజనమే కాదు చుట్టు ప్రక్కల పల్లెలలోని జనమంతా అక్కడే ఉన్నారు, పొరుగుననున్న రాజ్యాల నుంచీ వచ్చారు చెంచులు, మండాలు, కోయలు, శబరులు మొదలైన గిరిజనులలో ప్రముఖులుఅంతా అక్కడ చేరారు. గిరికా వసురాజుల వివాహానికి పర్వతిరాజులు అందరూ ఎల్లా వచ్చారో, క్లింగు-లింగుల వివాహానికీ అట్లాగే వచ్చారు. డోళ్ళు, తప్పెట్లు, పెద్దబాకాలు, కొమ్ములు, బూరాలు మొదలగు వాద్యములు వాయిస్తున్నారు. కొందరు తప్పతాగి గంతులేస్తున్నారు. అంతా కోలాహలంగా ఉన్నది.

మరియొక మూల బోయీలు, ఏవో మంత్రాలు చదువుతూ కులదేవతల తృప్తికోసం నైవేద్యాలు చేస్తున్నారు.

ఒకవైపు నాట్యాలూ నృత్యాలూ, ఇంకో వైపు చిందులు, గెంతులు, కేరింతలు! వారి ఆనందానికి మేర లేదు.

ఆరోజు క్లింగు_లింగులకు వివాహమైంది. వారు భార్యాభర్తలైనారు. శబరరాజుకు లింగ్ ఒక్కతే కుమార్తె. కాబట్టి ఆ రాజ్యాలకు క్లింగే ఏలిక అయినాడు. క్లింగు-లింగులు పరిపాలించిన దేశానికే కళింగదేశము అని పేరు వచ్చింది.

మన దేశంలో తూర్పుగోదావరి జిల్లాలో కొంత భాగమూ, విశాఖపట్నంజిల్లా ఏజెన్సీ—ఇప్పటి కళింగదేశము లోనివి. కళింగదేశపు ప్రజలను క్లింగులు అంటారు. వారు ఎక్కడికిపోయినా వారిని క్లింగులనే పిలిచేవారు. ఇప్పటికి వారు ఆ పేరుతోనే వ్యవహరింపబడుతున్నారు.

తూర్పు కళింగదేశానికి సముద్రపు వసతి వున్నది. అందుకని కాళింగులు కొందరు జావా సుమిత్రా ద్వీపాలకు వలసపోయినారు. అక్కడ వారిని నేటికిని కాళింగులని, క్లింగులనీ పిలుస్తారు. బర్మాలోనూ, మలయాలోనూ ఉన్న శ్రామికులు చాలామంది కాళింగులే! నేటికీ వారిని క్లింగులనే పిలుస్తారు!

"కళింగము" అనేమాట క్లింగు_లింగు అను మాటల కలయికవలన ఏర్పడ్డది.

(ఐపోయింది)